# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 3 । జూన్ । 2025






## హామీలేవీ నెరవేర్చలేదు

ఏడాదిలో కూటమి హామీలు నెరవేర్చలేదని కుంభా రవిబాబు అన్నారు. వెన్నుపోటుదినం విజయవంతంచేయాలన్నారు. - IIలో



## పాముకాటుతో మహిళ మృతి

ఇచ్ఛాపురంలో వరండాలో నిద్రపోతున్న ముగ్గురిని పాము కాటు వేసింది. ఒకరు మృతి చెందారు. - IIలో

## వంశధారలో ఇసుక తవ్వకాలు నిలుపుదల

జలుమూరు: వంశధార నదిలో నీటి ప్రవాహం మూలంగా ఇసుక తవ్వకాలు అక్టోబరు వరకూ నిలుపుదల చేసినట్లు జిల్లా మైన్స్ అండ్ జియోలజీ అధికారి సి.మోహన రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జలుమూరు తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిధి అంధవరం, పర్లాం, దొంపాక ఇసుక రీచ్‌లలో యంత్రాలతో తవ్వకాలు చేయకూడదని స్పష్టం చేశారు.

## న్యూస్‌రీల్

### వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ముగ్గుర్ని నియమిస్తూ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్రపార్టీ కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మార్పు అశోక్ చక్రవర్తి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా కాయ భీమశేను, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా డొప్ప రాములను నియమించారు.

### 5 నుంచి శ్రీముఖలింగేశ్వరుని కల్యాణ ఉత్సవాలు



శ్రీముఖలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 5 నుంచి 11 వరకూ జరగనున్నాయని ఈఓ పి.ప్రభాకరరావు సోమవారం తెలిపారు. 5న గణపతి పూజతో ప్రారంభించి ధ్వజారోహణ, బలిహరణ, 6న జేష్ఠ శుద్ధ ఏకాదశి స్వామివారి తిరువీధి ఉత్సవం, పుట్టమన్ను తేవడం, శతమానం, మట్టిలు తీసుకొని రావడం, రాత్రి తొమ్మిది గంటలకు స్వామి కల్యాణ రాయబారం, పది గంటలకు స్వామివారి కల్యాణ ఔపాసన అనంతరం రాత్రి పార్వతి పరమేశ్వరులను నంది వాహనంపై తిరువీధి ఉత్సవం, 7న స్వామివారి అన్నదానం, ఔపాసన, బలిహరణ, 9న సదస్యం, పండిత సభ, రుగ్వేద పారాయణం, మహా మంత్రపుష్పం, హారతి, 10న మైనాకోత్సవం, స్వామివారి వసంతోత్సవం, అనంతరం పవిత్ర వంశధార నదిలో పుణ్య పవిత్ర స్నానాలు ఉంటాయని తెలిపారు.

ఇల్లాలి పేరుపై ఇంటి పట్టా.. స్కూలు తెరిచే సమయానికి పిల్లాడి చదువుకు ఇబ్బంది లేకుండా ఆమె ఖాతాలో అమ్మ ఒడి డబ్బులు.. పేదరికం నుంచి బయటపడేందుకు 'చేయూత'.. రాజకీయంగా ఎదిగేందుకు పోస్టుల్లో వాటా.. ఐదేళ్ల పాలనా కాలంలో మహిళల కోసం వైఎస్సార్ సీపీ అమలు చేసిన కొన్ని పథకాలివి. ఆ ఐదేళ్లు వైఎస్ జగన్ సర్కారు 'అతివ'దేవోభవ మంత్రమే పఠించింది. కానీ కూటమి ఏడాది పాలనలో మోసం తప్ప సాయం చేయలేదు. ఉచిత బస్సు అని ఏడాది గడిపేసింది. విద్యా సంవత్సరం ముగిసిపోయినా తల్లికి వందనం ఇవ్వలేదు. నెలకు రూ.1500 ఇస్తామన్న హామీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పైగా స్థానిక సంస్థల్లో అధికార పీఠంపై ఉన్న విపక్ష నాయకురాళ్లను తీవ్రంగా వేధిస్తూనే ఉన్నారు.






# కూటమి మోసం.. ఇంతింత కాదయా..!

- ఏడాదిగా సంక్షేమ పథకాలకు దూరమైపోయిన మహిళలు
- వైఎస్ జగన్ పాలనలో మహిళల పేరుతోనే పథకాలు
- రాజకీయ పదవుల్లోనూ అతివలకే అగ్ర తాంబూలం
- ఎన్నో హామీలిచ్చి దారుణంగా మోసం చేసిన కూటమి



ఎల్ఎన్ పేట:

ఏడాది కూటమి పాలనలో మహిళలకు ఎదురుచూపులే మిగిలాయి. ఉచిత బస్సు ఎక్కిస్తారనుకుంటే.. రేషన్ డిపోల ముందు నిలబెట్టారు. తల్లికి వందనం ఇస్తారనుకుంటే.. ఇదివరకు ఉన్న పథకాలకు మంగళం పాడేశారు. నెలకు రూ.1500 పై ఆశలు పెట్టుకుంటే.. ఆ మాట తాము చెప్పలేదన్నట్టే వ్యవహరిస్తున్నారు. మూడు సిలిండర్లు ఫ్రీ అన్నారు.. రెండో సిలిండర్ డబ్బులు ఎప్పుడు, ఎంత మంది పడ్డాయో కూడా పత్తా లేదు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అని చెప్పి మహిళలను నమ్మించిన టీడీపీ ఏడాదిలో ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనతో పోల్చి చూస్తే కూటమి పాలనలో తమకు తీరని అన్యాయం జరిగిందని మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### సంక్షేమం అందేదెప్పుడో..?

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఎంత మంది పిల్లలను చదివిస్తే అంత మందికి తల్లికి వందనం పేరుతో రూ.15000 ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 19-59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని నమ్మించారు. ఇవేవీ ఇవ్వలేదు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. దీపావళి పండగ తర్వాత ఒక గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇచ్చారని, అందులో కూడా అనేక మందికి డబ్బులు జమకాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా మహిళలకు చార్జీల బాదుడు తప్పలేదు. తల్లికి వందనం ఒక ఏడాది పోయింది. నష్టపోయిన ఏడాది డబ్బుల పరిస్థితి ఏమిటా అని ప్రశ్నిస్తున్నారు.

### వైఎస్ జగన్ హయాంలో..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని సంక్షేమ పథకాలు సకాలంలో అందించారని మహిళలు గుర్తు చేసుకుంటున్నారు. జిల్లాలో ఇళ్ల లేని వేలాది మంది పేదింటి అక్కాచెల్లెమ్మల కోసం 784 లేఅవుట్లు వేసి 33,123 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చారు. పొదుపు సంఘాల మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, బ్యాంకు లింకేజీ స్థాయి పెంచటం, అమ్మఒడి, ఆసరా, చేయూత, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన తదితర అనేక సంక్షేమ పథకాలు మహిళలకు అందించారు.

### పాలనలోనూ..

వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకు పదవుల్లో మహిళలకు పెద్దపీట వేశారు. జెడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ కార్పొరేషన్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, నామినేటెడ్ పదవులు, డైరెక్టర్లు ఇలా అన్ని చోట్లా పరిపాలనలో అక్కచెల్లెమ్మలకు సగం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పించారు.



ఎల్.ఎన్.పేట:పథకాలు ఇచ్చిన జగనన్నకు జేజేలు పలుకుతున్న మహిళలు (ఫైల్)

### స్థలమిచ్చారు..



నా పేరు గుడివాడ ధనలక్ష్మి. ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట గ్రామం. ఇదే మండలం మల్లికార్జునపురం గ్రామానికి చెందిన గోపితో నాకు సుమారు 26 ఏళ్ల కిందట వివాహమైంది. మాకు ఏ ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వలేదు. అద్దె ఇంటిలోనే ఉండేవాళ్లం. వైఎస్ జగనే మాకు ఇంటి స్థలం ఇచ్చారు. కష్టపడి అక్కడ ఇల్లు కట్టుకున్నాం. స్థలమిచ్చి, కాలనీ ఇళ్లు మంజూరు చేసిన జగనన్నను మరిచిపోలేం.

### బాబు మోసం చేశారు



సూపర్ సిక్స్ పేరుతో మహిళలను చంద్రబాబు దారుణంగా మోసం చేశారు. ఉచిత బస్సు, విద్యా దీవెన వంటి పథకాలు బాబూ మోసానికి ప్రత్యక్ష ఉదాహరణలు.

– శిమ్మ శ్రీదేవి, మాజీ ఎంపీపీ, గొట్టిపల్లి, ఎల్.ఎన్.పేట

## పెదగనగళ్లవానిపేటలో నేడు యోగాంధ్ర



శ్రీకాకుళం పాతబస్టాండ్: పెద్దగనగళ్లవానిపేట తీరంలో మంగళవారం నిర్వహించనున్న యోగాంధ్రలో అంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం 3వ తేదీన పెద్దగనగళ్లవానిపేటలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. బీచ్ ఒడ్డున 5 వేల మంది మత్స్యకారులు, ఇతరులు 2 వేల మంది పాల్గొంటారని వెల్లడించారు. యోగా కేంద్రం వద్ద తాగు నీటి సౌకర్యం, తదితరమైనవి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

## డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



20వ బ్యాచ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఇస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 21 వ బ్యాచ్‌ను జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ సోమవారం ప్రారంభించారు. ముందుగా 20 వ బ్యాచ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్స్ అందజేసి, అభినందనలు తెలిపారు. అలాగే 22 వ బ్యాచ్‌లో చేరేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఫీజు, ఇతర వివరాలకు 9441161051, 7382921733 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2వ డిపోమేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కెఆర్ఎస్ శర్మ, శ్రీకాకుళం అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, ఎస్ఎం ఎంపీ రావు, పీఆర్వో కె.సుమన్, శిక్షకుడు వీఏవీ రావు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిశారు

- ఫలితాల్లో సత్తాచాటిన పలువురు విద్యార్థులు
- టాప్ ర్యాంకులన్నీ బాలురుకే సొంతం

శ్రీకాకుళం న్యూకాలనీ:

జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన విద్యార్థులు విజయబావుటా ఎగురవేశారు. మంచి ర్యాంకులు సాధించడంతో గుర్తింపు పొందిన ఐఐటీ, ఎన్ఐటీ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ సీట్లను సాధించారు. త్వరలో వీరంతా ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందనున్నారు. ఈ సారి ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో బాలురే ముందు వరుసలో నిలిచారు.



- ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమరాజ ఆలిండియా స్థాయిలో 216వ ర్యాంకు, ఓబీసీలో 30వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు సోమరాజు, కళ్యాణి కొడుకు విజయానికి ఆనందం వ్యక్తం చేశారు.



- పొందూరు: మండలంలోని అచ్చిపోలవలస పంచాయతీ సింగూరు గ్రామానికి చెందిన పైడి వెంకట శ్రీవినయ్ జాతీయస్థాయిలో 334వ ర్యాంకును, ఓబీసీ విభాగంలో 50వ ర్యాంక్ సాధించాడు. తండ్రి పైడి శ్రీహరి విశాఖలో సెంట్రల్ జైల్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. తల్లి కౌసల్య గృహిణి.



- పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రం రత్నాలపేటకు చెందిన శాసనపురి నిర్మిత్ ఆల్ ఇండియా 447వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 29వ ర్యాంకు సాధించాడు. తండ్రి శాసనపురం గోపికృష్ణ వ్యాపారవేత్త, తల్లి రజనీ గృహిణి.



- శ్రీకాకుళం నగరంలోని కత్తెరవీధికి చెందిన బోయిన లక్ష్మినివాస్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 794వ ర్యాంకు, జనరల్ ఈడబ్ల్యుఎస్ కేటగిరీలో 57వ ర్యాంకు సాధించాడు.



- పాతపట్నం మండలం సరాలి గ్రామానికి చెందిన పప్పు ప్రశాంత్ ఆల్ ఇండియా 807వ ర్యాంకు, ఓడీసీ కేటగిరీలో 124వ ర్యాంకు సాధించాడు. తండ్రి పప్పు ఈశ్వరరావు, తల్లి లతలు టీచర్లు.



- పొందూరు మండలం కింతలి గ్రామంలోని మెయిన్‌స్ట్రీట్‌కు చెందిన లఖినేని సాయిప్రియతమ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1081 ర్యాంకు సాధించగా, ఓబీసీ కేటగిరీలో 178వ ర్యాంకు సాధించాడు.



- జి.సిగడాం: స్థానిక మండల విద్యాశాఖ అధికారి-2గా పనిచేస్తున్న ముజ్జి శ్రీనివాసరావు కుమారుడు రోణిత్ నాయుడు ఆలిండియా స్థాయిలో 1692, ఓబీసీ కేటగిరీలో 293వ ర్యాంకు సాధించాడు. రోణిత్ తల్లి మజ్జి మోహిని కుమారి ఇంగ్లిష్ టీచర్. వీరి స్వస్థలం రణస్థలం.

### మెరిసిన జ్ఞాన రుత్విక్ సాయి



రుత్విక్‌సాయికి స్వీట్స్ తినిపిస్తున్న తండ్రి శంకర్ నారాయణ

నరసన్నపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో దేవాదికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి సత్తా చాటాడు. ఆలిండియా స్థాయిలో 18 వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో మొదటి ర్యాంకు కైవసం చేసుకున్నాడు. 310 మార్కులు పొంది తెలుగు రాష్ట్రాల్లో నంబర్ వన్‌గా నిలిచాడు. కెమిస్ట్రీలో 97 మార్కులు, ఫిజిక్స్‌లో 112 మార్కులు, మ్యాథమెటిక్స్‌లో 101 మార్కులు వచ్చాయి. దీంతో ఓబీసీ కేటగిరీ మొదటి స్థానం వచ్చింది. విద్యార్థికి 589 మార్కులు, ఇంటర్‌లో 988 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో 99.985 శాతం మార్కులు పొంది జాతీయ స్థాయిలో 294, ఓబీసీ కేటగిరీలో 38 వ ర్యాంకు పొందాడు. అలాగే మే నెల 4వ తేదీ నుంచి 12 వరకూ సౌదీ అరేబియాలో జరిగిన ఏషియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్ 2025లో ఇండియా తరఫున రుత్విక్ సాయి పాల్గొని తన సత్తా చాటాడు. రుత్విక్‌సాయి తల్లిదండ్రులు శంకర్‌నారాయణ, లతలు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తమ కుమారుడు ఈ స్థాయిలో మార్కులు పొంది జాతీయ స్థాయిలో 18 వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో మొదటి ర్యాంకు పొందడంపై ఆనందం వ్యక్తం చేశారు.

#### ఐఏఎస్ నా కల

ఐఏఎస్ సాధించడం తన కల అని రుత్విక్‌సాయి తెలిపాడు. హైదరాబాద్‌లో ఉన్న విద్యార్థి 'సాక్షి'తో సోమవారం మాట్లాడారు. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి అనంతరం సివిల్స్‌కు ప్రిపేర్ అవుతానని చెప్పాడు. విద్యార్థులకు ఫోన్ అలవాటుకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని తెలిపాడు.



- శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలోని ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన కేజేకే మహేంద్రా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1716వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 298వ ర్యాంకు సాధించాడు.



- రణస్థలం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన పిషిణి రమణ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1791వ ర్యాంకు సాధించారు. ఓబీసీ కేటగిరిలో 313వ ర్యాంకు సాధించారు. తండ్రి రామకృష్ణ పండ్ల వ్యాపారి, తల్లి ఆదిలక్ష్మి గృహిణి.



- శ్రీకాకుళం నగరంలోని రామ్‌నగర్‌కాలనీలో రామిగెడ్డవద్ద నివాసం ఉంటున్న టీఎస్ఎస్‌బీ చంద్రఅగస్త్య ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 2260వ ర్యాంకు సాధించాడు.



- నరసన్నపేటలోని మారుతీనగర్ కాలనీకి చెందిన బి.వి.కృష్ణచైతన్య ఆండియా ఓపెన్ కేటగిరీలో 3551వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 659వ ర్యాంకు సాధించాడు.



- టెక్కలిలో స్థిరనివాసం కలిగి ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలో నివసిస్తున్న పొట్నూరు ఈవీఎస్ఎస్ నిఖిల్‌కు ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 3777వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 700వ ర్యాంకు వచ్చింది.



- శ్రీకాకుళం నగరంలోని ఏఎస్ఎన్ కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఉంటున్న కూన రఘువీర్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 4160వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 790వ ర్యాంకు సాధించాడు.



- ఎల్ఎన్ పేట మండలంలోని మెంజెన్నపాడు గ్రామానికి చెందిన రావాడ భానుప్రకాష్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 4428వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 847వ ర్యాంకు తెచ్చుకున్నాడు.



- శ్రీకాకుళం నగరానికి చెందిన పి.రుక్మిణి ఓబీసీ కేటగిరీలో 887వ ర్యాంకుతో రాణించింది. అలాగే ఎస్.రాజారాఘవేంద్ర 3231వ ర్యాంకు, బి.సాయియశ్వంత్ 3337వ ర్యాంకు, పి.రాహుల్ 4495వ ర్యాంకు, పి.ప్రణయ్ 7719వ ర్యాంకులతో రాణించారు.
- పలాస మండలంలోని ఉదయపురం గ్రామానికి చెందిన తర్లాన అఖిల్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 5504వ ర్యాంకు, జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 591వ ర్యాంకుతో మెరిశారు.



- వీరితోపాటు పలాసలోని కుంటికోటకు చెందిన ఎం.బాలవర్ధన్ ఓబీసీ కేటగిరీలో 1578, శ్రీకాకుళం నగరంలోని విశాఖ-ఏ కాలనీకి చెందిన ఎస్.సాయిసంజయ్ ఓబీసీ కేటగిరీలో 1700, కాశీబుగ్గకు చెందిన కె.కేతన్‌వర్మ ఓబీసీ కేటగిరీలో 2055, ఆమదాలవలస మెయిన్ రోడ్‌కు చెందిన టి.వెంకటదర్శన్ జనరల్ ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 1188 ర్యాంకు సాధించాడు.



- కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన కుశిరెడ్డి సాయిఅనీష్ ఆల్ ఇండియాలో 5622 ర్యాంకు, ఓబీసీ సిఆర్ఎల్ 1110 ర్యాంకు సాధించాడు. తండ్రి కుశిరెడ్డి గంగాధరరావు రైల్వేలో లోకోపైలెట్‌గా పనిచేస్తున్నారు. తల్లి కుశిరెడ్డి మమతరెడ్డి ఉపాధ్యాయురాలు.



- సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన సానా మురళి కుమార్తె సానా మోక్షలలిత ఈడబ్ల్యూఎస్ కోటాలో 742వ ర్యాంకు, జనరల్ కేటగిరీలో 6644వ ర్యాంకు సాధించింది.



- మందస మండలం దున్నూరు పంచాయతీ మొగిలిపాడుకు చెందిన నూకల రోహిత్ ఆల్ ఇండియాలో 7630, ఏబీసీ కేటగిరీలో 1627వ ర్యాంకు సాధించాడు. కాశీబుగ్గ పట్టణంలో తండ్రి నూకల హేమసుందర్, తల్లి విజయలు ఫొటో స్టూడియో నడుపుతుంటారు.



- పాతపట్నం మండలం చిన్నలోగిడి గ్రామానికి చెందిన పడాల జాహ్నవికి ఆల్ ఇండియా 5,745వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 1,146వ ర్యాంకు వచ్చింది. తండ్రి పడాల రేవతి వల్లభరావు, తల్లి పడాల శ్రీరామ్ జగదీశ్వరి టీచర్లు.



- పాతపట్నంకు చెందిన చింతాడ అభిషేక్ ఆల్ఇండియా 4,870వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 945వ ర్యాంకు సాధించాడు. తండ్రి చింతాడ క్రిష్ణారావు టీచర్. తల్లి చింతాడ రోహిణి గృహిణి.



- టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన మణి పాత్రుని వినయ్‌కుమార్ ఓపెన్ కేటగిరిలో 9920వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్‌లో 1224వ ర్యాంకు సాధించాడు. తండ్రి శ్రీనివాసరావు మెడికల్ షాపు నడుపుతుంటారు.
- కోటపాడు గ్రామానికి చెందిన భాగవతుల సాయి ప్రణీత్ ఓపెన్ కేటగిరీలో 17,686, ఈడబ్ల్యూఎస్‌లో 2431వ ర్యాంకు సాధించాడు. తండ్రి నరేంద్ర, తల్లి శారద.

## 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరించిన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కారం అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేష్‌తో ఆయన మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటేందుకు ముందుగా గోతులు చేసేందుకు స్థలాలను గుర్తించాలని మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ సుగుణాకరరావును ఆదేశించారు. మొక్కలకు ట్రీ గార్డులు కూడా పెట్టాలన్నారు.

## డిగ్రీ మూల్యాంకన విధుల బహిష్కరణ


శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల డిగ్రీ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని బహిష్కరించాలని డిగ్రీ లెక్చరర్లు నిర్ణయించారు. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరగనున్న డిగ్రీ రెండో, నాల్గో సెమిస్టర్ మూల్యాంకన విధులను బహిష్కరిస్తున్నట్లుగా స్పాట్ క్యాంప్ ఆఫీసర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్స్, ప్రాక్టికల్స్ చేయించుకుని మరో సెమిస్టర్ పూర్తయ్యేవరకు వాటి బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తు ఉదాశీనతను కనబరుస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని వారు మండిపడ్డారు. యూనివర్సిటీ అధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చేవరకు మూల్యాంకన విధులు బహిష్కరిస్తున్నట్లు స్పష్టంచేశారు.

## కంప్యూటర్ ఆపరేటర్‌కు 13 రోజుల రిమాండ్

పొందూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సువ్వారి సన్యాసిరావుకు పొందూరు కోర్టు జడ్జి 13 రోజుల రిమాండ్ విధించారు.

ఇటీవల కార్యాలయంలో అవసరాలు తీర్చుకోవడానికి బాత్‌రూమ్‌కు వెళ్లిన మహిళా ఉద్యోగి వీడియో చిత్రీకరించడంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు సన్యాసిరావుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సోమవారం పొందూరు సీహెచ్‌సీలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. దీంతో సన్యాసిరావుకు 13 రోజుల రిమాండ్‌ను విధించారు.

## వర్ణ శోభితం



నింగి రంగులీనింది. సూర్యాస్తమయ సమయాన ఇచ్ఛాపురం ప్రాంతంలో ఇలా వర్ణశోభితమై కనిపించింది. - ఇచ్ఛాపురం రూరల్

## క్లుప్తంగా

### నేడు జాబ్ మేళా

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ వి.కణితిష్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల నుంచి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికాస ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ ఆధ్వర్యంలో ఇసుజు మోటార్స్ లిమిటెడ్, ఇండో ఎంఐఎం, మోడీన్ థర్మల్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హుందాయ్ మోబీస్, హుందాయ్ గ్లోవిస్, ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, పిల్ కింగ్టన్ కంపెనీలకు సంబంధించి ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమో, బీటెక్ వంటి అర్హత కలిగిన 26 సంవత్సరాల్లోపు యువతీ, యువకులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 91828 94790, 97056 52552 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### పోలీసు ఫైరింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్



మెడల్ అందుకుంటున్న పాపారావు

మందస: మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన మామిడి పాపారావు యాదవ్ 300 మీటర్ల ఫైరింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. పాపారావు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర పోలీసుగా పని చేస్తున్నారు. ఇదివరకు 2021 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రెసిడెంట్ మెడల్ సాధించారు. 300 మీటర్లు ఫైరింగ్‌లో గోల్డ్ మెడల్‌ను తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

### గంజాయితో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన చిట్టా ఎర్రయ్య అనే వ్యక్తిని టెక్కలి పోలీసులు గంజాయితో అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం సాయంత్రం ఒలేసాగరం సమీపంలో సీఐ విజయ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఎర్రయ్య పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో అతడిని పట్టుకుని తనిఖీ చేయగా 620 గ్రాముల గంజాయి పట్టుబడింది. అయితే సదరు వ్యక్తి గంజాయి అమ్మడంతో పాటు తాను సైతం తాగుతుంటాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేశారు. అతడిపై 2023వ సంవత్సరం జూలైలో సైతం గంజాయి కేసు నమోదైంది.

### నాటుసారాతో వ్యక్తి అరెస్టు




స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం, నాటుసారా ప్యాకెట్లు

కవిటి: మండల పరిధిలోని లండారిపుట్టుగ సమీపంలో సోమవారం మొబైల్ పెట్రోలింగ్ ఎక్సైజ్ సీఐ జీవీ రమణ నేతృత్వంలో చేసిన దాడుల్లో 250 నాటుసారా ప్యాకెట్లతో నర్తు జగ్గారావు అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ దాడిలో సారా ప్యాకెట్లు తీసుకొచ్చేందుకు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఎక్సైజ్ శాఖకు ఈ కేసు బదలాయించినట్లు పేర్కొన్నారు.

### భార్య అనుమానాస్పద మృతి కేసులో భర్త అరెస్టు

కొత్తూరు: మండలంలోని మహార్తాపరంలో నివాసం ఉంటున్న నిమ్మక ప్రవల్లిక మే 29వ తేదీన ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తమ అల్లుడు పత్తిక సురేష్ అదనపు కట్నం వేధింపులు కారణంగానే కుమార్తె మృతి చెందినట్లు మృతురాలు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎండీ అమీర్ అలీ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో మృతురాలు భర్త సురేష్‌ను సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

### బొల్లినేని విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం రూరల్: ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం ప్రకటించిన బీఎస్సీ పారా మెడికల్ మొదటి సంవత్సరం ఫలితాల్లో బొల్లినేని మెడిస్కిల్స్‌కు చెందిన యు.వాగ్దేవి(540) యూనివర్సిటీ రెండో ర్యాంకు సాధించినట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అలాగే బి.బిందు, యశ్వంత్, సునీత, భార్గవి, షణ్ముఖశ్రీ, ప్రసన్న వివిధ విభాగాల్లో మంచి ర్యాంకులు సాధించారు. దీంతో వీరికి అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీపద్మజ, సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే బొల్లినేని మెడిస్కిల్స్‌లో బీఎస్సీ పారామెడికల్, డిప్లొమా కోర్సులకు ప్రవేశాలు జరుగుతున్నట్లు వెల్లడించారు.

# హామీలేవీ నెరవేర్చలేదు



మాట్లాడుతున్న కుంభా రవిబాబు

కూటమిపై దుమ్మెత్తిపోసిన కుంభా రవిబాబు

ఆమదాలవలస:

వెన్నుపోటు రాజకీయాలు సీఎం చంద్రబాబు నైజమని మాజీ ఎమ్మెల్సీ, జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు కుంభా రవిబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతాడ రవికుమార్ అధ్యక్షతన వెన్నుపోటు దినం సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో ఒక్క హామీకూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు తీసుకురావడం అంటే ప్రజానీకంపై భారం మోపడమేనని స్పష్టం చేశారు. 6 గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రజలను అప్పుల్లో ముంచేస్తున్నారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

**జయప్రదం చేయండి**

ఈనెల 4వ తేదీన తలపెట్టనున్న వెన్నుపోటు దినంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో హామీలు అమలు చేయాలని చంద్రబాబుకు కనువిప్పు కలిగిస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలు, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, అరాచక పాలనను కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. కూటమి పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చింతాడ రవి కుమార్ మాట్లాడుతూ వెన్నుపోటు దినంకు సంబంధించి నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉదయం 9.30 గంటలకు స్థానిక గాంధీ జంక్షన్ కొత్త కంద్రపేట జంక్షన్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, పొడుగు శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

## సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- మీకోసంలో 87 అర్జీలు స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పెండింగ్‌లో ఉన్న అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీ కోసం)లో ఆయన 87 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తహసీల్దార్ల వద్ద వివిధ సర్టిఫికెట్లు పెండింగులో ఉన్నాయని, పెండింగ్‌కు గల కారణాలు తెలియజేయాలన్నారు. సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయకుంటే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. సత్వరమే సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. రైస్ కార్డులు పెండింగులో లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, సర్వే అండ్ లాండ్ రికార్డులు, మహిళా శిశు సంక్షేమం, రిజిస్ట్రేషన్, సర్వశిక్ష అభియాన్, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఏపీఈపీడీసీఎల్, జీజీహెచ్ తదితర శాఖలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్ వి.శ్రీధర్‌రాజ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీ గ్రీవెన్స్‌కు 51 ఫిర్యాదులు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రమణ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వ్యక్తిగతంగా మాట్లాడి, సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌కాల్స్ ద్వారా తక్షణమే తెలియపరచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలన్నారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామంలో విశ్వశాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం మకరాంపురం ఏ – శ్రీరాంపురం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి బ్యాటింగ్ చేసిన మకరాంపురం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీరాంపురం జట్టు 104 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బి.సాత్విక్ 21 బంతుల్లో 59 పరుగులు చేశాడు.

## విజయవంతం చేయండి

- రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వరూప్

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఒక్కటంటే ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్ అన్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచనల మేరకు ధర్మాన క్యాంప్ కార్యాలయంలో యువజన, విద్యార్థి విభాగం నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూప్ మాట్లాడుతూ కూటమి వైఫల్యాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జూన్ 4వ తేదీన చేపట్టనున్న వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని కోరారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని మన భావజాలానికి, మన ఉద్దేశాలకు, ప్రజలపై మన నిబద్ధతకు ప్రతీక అన్నారు. ఇటువంటి కార్యాచరణల ద్వారా మనం సమాజంలో మార్పుని తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గుండ హరీష్, మేడేపల్లి భరద్వాజ్, యాళ్ల శ్రీను, గొండు భరత్, ఇషాక్ హుస్సేన్, నీలాద్రి, అల్లు అనిల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ దేవతను తిరువీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం



మఠం కంచిలి వద్ద ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారం



పాలబొమ్మలాట

## కరుణించు కంచమ్మ..!

కంచిలి: కంచిలి గ్రామ దేవత కంచమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ఆదివారం రాత్రి ఆలయం నుంచి పీఠస్థానానికి ఊరేగింపుగా మేళతాళాల మధ్య తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ప్రతిరూపంతోపాటు కాళికా వేషధారణలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. దీంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రథాలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ పి.పారినాయుడులు బందోబస్తును సమీక్షించారు.

## పీఎఫ్ సమస్యలు పరిష్కారం చేయాలి



నిరసన తెలుపుతున్న రిమ్స్ పారిశుద్ధ్య కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని, రిమ్స్ కార్మికుల కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కి ఫిర్యాదు చేశారు. కృష్ణ కన్స్ట్రక్షన్ యాజమాన్యం రిమ్స్ ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు నాలుగు సంవత్సరాల కాలంలో పీఎఫ్ జమాల్లో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. దీనిపై అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఒక్కొక్క కార్మికుడి దగ్గర సుమారుగా రూ.లక్ష వరకు దోచుకున్నారని వాపోయారు. దీనిపై హైకోర్టు నిర్ధారణ చేసి 3 సంవత్సరాల పాటు ఏ కాంట్రాక్టులోనూ వారు పాల్గొనకుండా సస్పెండ్ చేసిందని పేర్కొన్నారు. అయితే శ్రీకాకుళం రిమ్స్‌లో సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు తీసుకొని వెళ్లిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ రిమ్స్ ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ జమాల్లో ఉన్న వ్యత్యాసాలపై తగు విచారణ జరపాలని, కాంట్రాక్టర్‌కు యాజమాన్యం బిల్లులు నిలుపుదల చేయాలని రిమ్స్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా నాయకులు దుర్గాసి గణేష్, దమ్ము సింహాచలం, కొప్పుల భాస్కరరావు, అంబటి అరుణ, ఆకుల శ్యామల, దువ్వు జయప్రద, కె.ఎల్లమ్మ, కె.రాజశేఖర్, సోమవారంపేట నరసింహమూర్తి, అప్పలనాయుడు, దుండంగి వెంకటరమణ, పాలొరి బీబీ, దమ్ము అన్నపూర్ణ, దమ్ము పద్మ, దమ్ము దుర్గ, దమ్ము చిన్నారావు, కొర్లకోట కావ్య, బాలసుందర్, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన సల్మాన్



నుజ్జయిన లారీ ముందరి భాగం

నరసన్నపేట:

జాతీయ రహదారిపై గుండవల్లిపేట పెట్రోల్ బంకు సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు చెందిన సల్మాన్ (19) మృతి చెందాడు. ముందున్న లారీకి వెనుక నుంచి బలంగా చెన్నై నుంచి కోల్‌కతాకు వెళ్తున్న కార్గో లారీ బలంగా ఢీకొంది. దీంతో లారీ నడుపుతున్న సల్మాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న నరసన్నపేట పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వచ్చి వాహనాలను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

## ఉపాధి పనికి వెళ్తూ వృద్ధుడు మృతి



ఎర్ర రామారావు (ఫైల్)

పాతపట్నం: మండల కేంద్రంలోని కొత్త దేవాంగుల వీధికి చెందిన ఎర్ర రామారావు (64) ఉపాధి పనికి వెళ్తూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొత్త దేవాంగుల వీధికి చెందిన ఎర్ర రామారావు, అతని భార్య జయమ్మలు కలిసి వీధిలోని అందరితో పాటు సోమవారం ఉదయం నీలమణిదుర్గ ఆలయం సమీపంలో ఉన్న తాడి చెరువులో ఉపాధి పని కోసం ఇంటి నుంచి నడుచుకుంటూ బయల్దేరి వెళ్లాడు. అయితే కాకితోట వద్ద కడుపు నొప్పిగా ఉందని రామారావు కూర్చొని పోవడంతో ఉపాధి కూలీలందరూ కలిసి రోడ్డు మీదకు తీసుకొచ్చారు. అనంతరం ఆటోలో పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అయితే అతను అప్పటికే మృతి చెందాడని ఆస్పత్రి సిబ్బంది తెలపడంతో భార్య జయమ్మ రోదన అందరినీ కంటతడి పెట్టించింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి



వంకల తాతారావు(ఫైల్)

పలాస: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల తాతారావు(60) కిడ్నీ వ్యాధితో సోమవారం మృతి చెందారు. గత ఏడాది కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కాశీబుగ్గ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లాడు. డయాలసిస్ చేయిస్తుండగా హఠాత్తుగా అక్కడే మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని సింగుపురం గ్రామ సమీప కొండమ్మ కాలనీకి ఆనుకుని వెళ్లే జాతీయ రహదారి ప్రదేశంలో 65 సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శ్రీకాకుళం రూరల్ పోలీసులు సోమవారం గుర్తించారు. మధ్యాహ్నం నుంచి అచేతన స్థితిలో పడి ఉండడాన్ని కొంతమంది చూసినట్లు తెలిపారు. ఎవరో మద్యం మత్తులో ఉన్నారు అనుకొని ఎవరూ పట్టించుకోలేదు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా చనిపోయినట్లు గుర్తించారు. మృతదేహాన్ని రిమ్స్‌కి తరలించారు. బంధువులు ఎవరైనా గుర్తిస్తే శ్రీకాకుళం రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## పాముకాటుతో మహిళ మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషమం



తలగాన పూజ (ఫైల్)



పూజ మృతదేహం

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని అమీన్‌సాహెబ్‌పేటలో ఆదివారం రాత్రి తలగాన పూజ(27), వంజరాన జయరాం, గీత కృష్ణవేణిలు నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో తలగాన పూజ మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతురాలి బంధువులు ఇచ్చిన సమాచారం ప్రకారం కవిటి మండలం శావసానపుట్టుగ గ్రామానికి చెందిన తలగాన పూజ అమీన్‌సాహెబ్ పేటలో జరుగుతున్న ఆలయ ప్రతిష్ఠకు అమ్మమ్మ గారింటికి వచ్చింది. దీనిలో భాగంగా కుటుంబ సభ్యులతో పాటు అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు చూశారు. అనంతరం ఇంటికి వెళ్లగా ఉక్కగా ఉండడంతో ఇంటి వరండాలో పడుకున్నారు. అయితే ఆ సమయంలో వారి ముగ్గురినీ పాముకాటు వేసింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బరంపురం తరలిస్తుండగా మార్గమధ్యలో తలగాన పూజ మృతి చెందినట్లు తెలిపారు. వంజరాన జయరాం, గీత కృష్ణవేణిలకు ఐసీయూ ఉంచి వైద్యసేవలు అందిస్తున్నారు. మృతురాలి భర్త తలగాన శంకర్ రోజుకూలీ చేస్తూ జీవిస్తుంటారు.

## జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 2025–26 కొత్త విద్యా సంవత్సరంలో జూనియర్ కాలేజీలు పునః ప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం సోమవారం జిల్లాలో జూనియర్ కాలేజీలు తెరుచుకున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు శతశాతం పనిచేశాయి. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు హాజరయ్యారు. అయితే విద్యార్థులు మాత్రం అంతంతమాత్రంగానే హాజరైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని కాలేజీల్లో కనీసం పది మంది కూడా హాజరుకాలేదని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలకైతే కనీసం విద్యార్థులే రాలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. హాజరైన పిల్లలతో క్లాసులతోపాటు సమీప గ్రామాల్లో అడ్మిషన్ డ్రైవ్స్‌ను నిర్వహిస్తున్నారు. పిల్లలు హాజరైన చోట డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసినట్లు ఇంటర్ విద్య జిల్లా అధికారి ఆర్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. శతశాతం మంది విద్యార్థులు కాలేజీలకు హాజరయ్యేవిధంగా ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని సూచించారు. ఇంటర్ కోర్సులను అందిస్తున్న ప్రభుత్వ యాజమాన్య కాలేజీలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా పేరిట అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ వెంటనే పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, BUDDEPU VENKATARAMANA, S/o BUDDEPU APPALASWAMY, R/o KOTTALINGUDU Village & Post, SANTHABOMMALI Mandal, SRIKAKULAM district, A.P. State, PIN: 532211.I Have my changed name from BUDDEPU VENKATA RAO (old name) to BUDOEPU VENKATARAMANA (New Name) in my passport. Shall henceforth be called known as BUDDEPU VENKATARAMANA for all practical purposes.

COACHING CENTER

Banks, SSC, RRB, Defence & NAVODAYA & SAINIK SCHOOL. New Batches Started. Surya Academy, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V-6745]

WANTED

RK ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేయుటకు వంట మాస్టర్స్, టిఫెన్ మాస్టర్స్, వార్డెన్స్, స్కావెంజర్స్ (బాత్ రూమ్స్ క్లీన్ చేయుటకు) వెంటనే కావలెను. సంప్ర: కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ. సెల్: 97014 73399 [G-44]

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999 [HA-15907]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.